02 SEP 2020 ANDHRA JYOTHI

## కంటైన్మెంట్ జోన్‌లో మల్లాడి పర్యటన



కంటైన్మెంట్ జోన్‌లో పర్యటిస్తున్న మంత్రి మల్లాడి

యానాం, సెప్టెంబరు 1: హోంఐసోలేషన్ కొవిడ్ బాధితులను మంత్రి మల్లాడి కృష్ణారావు మంగళవారం పరామర్శించారు. భీమ్‌నగర్, యూకేవీ నగర్, కనకాలపేటల్లో కంటైన్మెంట్ జోన్లలో హోం ఐసోలేషన్ ఉన్న వారిని ఇంటింటికీ వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగితెలుసుకున్నారు. అయితే కొంతమంది నిబంధనలను పాటించట్లేదని, నిర్లక్ష్యంగా ఉంటే కుటుంబీకులందరూ వైరస్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఇలా చేస్తే హోం ఐసోలేషన్ రద్దు చేసి యానాంలోని ప్రభుత్వ ఐసోలేషన్‌కు తరలిస్తామని చెప్పారు. కాగా ఈఅంశంపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రాంతీయ పరిపాలనాధికారి శివరాజ్ మీనా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇల్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే హోం ఐసోలేషన్‌కు అనుమతి ఇవ్వాలని, జోన్ అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలన్నారు.

## ఘనంగా రక్షా హరికృష్ణ జయంతి

యానాం, సెప్టెంబరు 1: యానాం మాజీ ఎమ్మెల్యే, మత్స్యకార నాయకుడు రక్షా హరికృష్ణ 80వ జయంతి మంగళవారం నిర్వహించారు. మెట్టకూరు మత్స్యకార పేటలో గల హరికృష్ణ నిలువెత్తు విగ్రహానికి మంత్రి మల్లాడి కృష్ణారావు, అగ్నికులక్షత్రియ సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ సం క్షేమ సేవా సంఘం సభ్యులు, మెట్టకూరు మత్స్యకారపేట పెద్దలు, ఇతర సంఘాల నాయకులు, హరికృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వాక్ ఇన్ ఇంటర్వ్యూ

యానాం, సెప్టెంబరు 1: యానాం నియోజవర్గ పరిధిలోని ప్రభుత్వ సామాన్యఆసుపత్రిలో ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ ఇన్ జనరల్ ఫిజీషియన్ పోస్టుకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు. నెలసరి వేతనం రూ.85 వేలు ఇస్తామన్నారు. అర్హత కలిగిన డాక్టర్లు పూర్తి వివరాలతో శుక్రవారం ఉదయం 11 గంటలకు యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయానికి హాజరు కావలని మంగళవారం ప్రకటనలో కోరారు.

## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, సెప్టెంబరు 1: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతిలో ప్రవేశానికి లేటరల్ ఎంట్రీ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల7వతేదీలోపు www.nvsad-missionclasseleven.in సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మార్కులు, గ్రేడులు లేని వారు వాటి స్థానంలో హాల్ టికెట్, అడ్మిట్‌కార్డ్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 0884- 2321375, 9490655706, 8552975532 నెంబర్లను సంప్రదించాలన్నారు.

02 SEP 2020 ENADU

## లక్షణాలున్నా లేకున్నా పరీక్షలు చేయండి : మల్లాడి

**యానాం:** ఇళ్ల వద్ద ఉండి చికిత్స పొందుతున్న కరోనా రోగుల కుటుంబ సభ్యులలో వైరస్ లక్షణాలున్నా లేకున్నా వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు సూచించారు. ఆరోగ్యశాఖ వైద్యాధికారులతో కరోనా కేసుల గురించి సమీక్షించిన సందర్భంగా మంత్రి ఈ సూచన చేశారు. ఇళ్ల వద్ద ఉండి చికిత్స పొందుతున్న కరోనా రోగులను మంగళవారం ఆయన పరామర్శించారు. యానాం వృద్ధాశ్రమం నుంచి ఆహారం పంపిస్తానని వారికి తెలిపారు.

యానాంలోను మంగళవారం అధిక సంఖ్యలో కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

02 SEP 2020 SAKSHI

# ముంపు వీడింది.. పరిహారం ఏమైంది?



యానాంలో వరద ముంపునకు గురైన ఇళ్లు (ఫైల్)

**యానాం:** గౌతమీ గోదావరి వరద ఉద్ధృతికి ముంపునకు గురైన ఇళ్లకు, పంటలకు నష్టపరిహారం ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంపై బాధితులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వరదలు వస్తున్నప్పటికీ తాత్కాలిక చర్యలు మినహా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టడం లేదని, వాటిపై పుదుచ్చేరి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని వారు కోరుతున్నారు. నదీతీర ప్రాంతాల్లో నివాసాలు, యానాం నియోజకవర్గం భౌగోళిక ప్రాంతం చిన్నది కావడంతో నివాసయోగ్య స్థలాల లభ్యత గగనంగా మారింది. గతంలో ప్రభుత్వం వేలాది నివేశన పట్టాలు ఇచ్చినా.. ప్రస్తుతం ఎక్కడా ప్రభుత్వ ఖాళీ స్థలాలు లభ్యం కావడం లేదు. దీంతో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయాలని అనుకున్నప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షల్లో అమ్ముతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని భూముల్లో పలువురు లేఅవుట్లు వేయడంతో చాలా మంది మధ్యతరగతికి చెందిన వారు చౌకగా కొనుగోలు చేసుకుని శాశ్వత ప్రాతిపదికన ఇళ్లు కట్టుకున్నారు. వరదలు వస్తే మాత్రం ఇవి ముంపునకు గురవుతున్నాయి. వీటి చుట్టూ రూ.137 కోట్లతో గతంలో రూపొందించిన ఫ్లడ్ మేనేజ్‌మెంట్ పనులను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

గౌతమీ గోదావరికి వరదలు వచ్చే సమయంలో నదీ తీర ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్న బాలయోగి నగర్, ఫ్రాన్స్‌తిప్ప, కోన వెంకటరత్నం నగర్, ఓల్డ్ రాజీవ్‌నగర్, గురుకృష్ణాపురం, మట్టా గార్డెన్, అయ్యన్న నగర్ తదితర ప్రాంతాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. గత నెల 14వ తేదీనుంచి వచ్చిన వరద ఉద్ధృతికి ఈ ప్రాంతాల్లోని సుమారు వెయ్యి ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఇంట్లో సామాన్లు పూర్తిగా మునిగిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వరద నష్టానికి గురైన బాధితులకు రూ.2 వేల నగదు, బియ్యం ఇస్తామని పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించి వారాలు గడుస్తున్నా అవి ఇప్పటికీ అందని పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క గోదావరిని చేర్చి ఉన్న దరియాలతిప్ప, కనకాలపేట, పరంపేట తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల లంక భూములు ముంపునకు గురయ్యాయి. నష్టపోయిన తమను ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

PRAJA SAKTHI 02 SEP 2020

## కరోనా బాధితులకు మల్లాడి పరామర్శ

యానాం : ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా బాధితులను పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మాల్లాడి కష్ణారావు పరామర్శించారు. కరోనా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యం, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే మెట్టకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఐసోలేషన్‌లో ఉన్న కరోనా బాధితులను ఆయన పరామర్శించారు.